నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
సోమవారం | 08 జనవరి 2024 | www.navatelangana.com

అసంఘటిత రంగ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

- గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేసి వారి సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ మండల విస్తృత సమావేశం నంగునూరులో మండల నాయకులు రాజమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి గ్రామ పంచాయతీ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులను విస్మరించిందన్నారు. ఈ తరుణంలోనే కార్మికుల ఆగ్రహానికి గురై ఇంటిబాట పట్టిందన్నారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా ఉండాలని, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తెచ్చి కార్మికుల్ని ఆదుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే హమాలీ రంగ కార్మికులకు, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వాటి ద్వారా సంక్షేమ ఫలాలు అందే విధంగా చూడాలని తెలిపారు. హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఇల్లులేని వారికి గృహలక్ష్మి పథకం కింద ఇల్లును మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో లబ్దిదారులు కార్మికుల ముందు వరుసలో ఉంచాలన్నారు. 55 సంవత్సరాల నిండిన వారికి రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. రవాణా రంగ కార్మికులకి ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో రోడ్డున పడుతున్న వారిని ఆదుకోవాలని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలన్నారు. ఆటో కార్మికుల్లో అర్హులైనవారిని కొత్తగా తీసుకొస్తున్న బస్సులకు ఆర్టీసీ డ్రైవర్లుగా తీసుకోవాలని, మూడు నెలల పాటు రోడ్‌ట్యాక్స్, ఇఎంఐలు తదితర అంశాలు వెసులుబాటు కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న కాలంలో కార్మిక వర్గాల ఐక్యం చేసి పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. నంగునూరు సీఐటీయు మండల కన్వీనర్ దేవులపల్లి రాజమౌళి, కో-కన్వీనర్లుగా అనరాజు ఎల్లయ్య, బంగారు నరసింహులు, కమిటీ సభ్యులుగా డి.సత్యనారాయణ, బుచ్చయ్య బాలరాజు, కనకరాజు, కనకయ్య రవీందర్, భాస్కర్, రామచంద్రం, రాజయ్య, మల్లయ్య, లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



- ప్రైవేట్ వ్యాపారస్తుల కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి
- పత్తి రైతుకు మద్దతు ధర ఇప్పించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులను ఇబ్బందులు పెట్టకుండా సీసీఐ పత్తి కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సదాశివపేట మండలం ఆత్మకూరు గ్రామంలో జరిగిన సమావేశంలో జయరాజు మాట్లాడుతూ పత్తి రైతులకు అన్యాయం చేస్తూ ప్రైవేట్ వ్యాపారస్తుల కొమ్ము కాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను తిరిగి వెంటనే ప్రారంభించాలని కోరారు. పత్తి పూర్తిగా రైతుల వద్ద ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందక పోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేట్ వ్యాపారస్తుల కొమ్ము కాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఐ, పత్తి మిల్లుల యాజమాన్యాలు, బయట ప్రైవేటు వ్యాపారస్తులు కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ప్రైవేటు కొనుగోలుదారులు, బయట ప్రైవేట్ వ్యాపారస్తులు రూ.6,300లకు గ్రామాల్లో రైతుల వద్ద పత్తి కొని లారీల్లో నింపి నేరుగా ప్రైవేటు వ్యాపారస్తులు సీసీఐకి అమ్ముతున్నారని తెలిపారు. సీసీఐకి మద్దతు ధర రూ.7020 చొప్పున ప్రైవేట్ వ్యాపారస్తులు అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతులు మాత్రం ఒక క్వింటాల్ పత్తికి రూ.500 నుంచి రూ.700 వరకు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే ప్రైవేట్ వ్యాపారస్తులపై చర్యలు తీసుకోని, నేరుగా సీసీఐ రైతుల నుంచి పత్తి కొనే విధంగా ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల పేర్లు ఆన్లైన్లో లేకపోవడంతో ఇటు జిన్నింగ్ మిల్ యజమానులు, సీసీఐ కొనుగోలు సిబ్బంది, ప్రైవేట్ వ్యాపారస్తులు కలిసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. వారిపై వెంటనే చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి అశోక్,పోచయ్య మహేష్, పుష్పమ్మ, రాములు, రత్నయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ నిర్వహించాలి

- ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ అధికార మాసపత్రిక వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ రాష్ట్ర ప్రధాన సంపాదకులు పాపన్నగారి మాణిక్‌రెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి

డీఎస్సీ నిర్వహించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ అధికార మాసపత్రిక వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ రాష్ట్ర ప్రధాన సంపాదకులు పాపన్నగారి మాణిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ విస్తృత సమావేశం కే.అశోక్ అధ్యక్షతన కేకే భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్‌యూటీఎఫ్ అధికార మాసపత్రిక వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ రాష్ట్ర ప్రధాన సంపాదకులు పాపన్నగారి మాణిక్‌రెడి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి వెంటనే మెగా డీఎస్సీ వేస్తామనడం అభినందనీయం అన్నారు. వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. 25 వేల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో చదువుల్లో సమానత్వం సాధించాలన్నారు. అంతరాలు లేని అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలన్నారు. పీఆర్సీ నివేదిక వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న డీఏ ఇవ్వాలని కోరారు. పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి మాట్లాడుతూ పదోన్నతుల్లో ఉపాధ్యాయులకు టెట్ కంపల్సరీ చేయడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని టెట్ క్వాలిఫై కావడానికి 5 సంవత్సరాలు గడువు ఇవ్వాలి లేదా స్పెషల్ టెట్ నిర్వహించాలని అన్నారు. ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు వేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కే.అశోక్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురైందని, పర్యవేక్షక పోస్టులైన 21 డీఈఓ, 64 డీవైఈఓ 580కి పైగా పోస్టులు, 774 హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా వీటిని భర్తీ చేసి



పాఠశాలలను బాగు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నదని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు మాట్లాడుతూ మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీల ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పదోన్నతులు నిర్వహించాలన్నారు. అన్ని గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా రాష్ట్ర కమిటీ సభ్యులు ఏం. శామయ్య, యం. అమరేశ్వరీ, జిల్లా ఉపాధ్యక్షులు ఏం. సువరణ, జె. కాశీనాథ్, కోశాధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు ఎం నరేష్, బి. సాయితేజ, బి. అరునశ్రీ, కృష్ణమూర్తి, ముఖండ్, కృష్ణంరాజు, జగన్మోహన్, సంయుద్దీన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ చందర్ రాథోడ్, నాయకులు జ్యోతి లింగం, సర్దార్, హరి సింగ్, అప్పారావు, బాలరాజు, నాగమణి, స్వప్న, రాజేశ్వరి, కృష్ణ, విజయానంద్ వాసు నాయక్, సైమన్, జోత్స్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం శివారులో చిరుతపులి సంచారం

నవతెలంగాణ జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారం శివారులో శనివారం రాత్రి చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. ఈ సంఘటనకు సంబంధించి జిన్నారం బొంతపల్లి ప్రధాన రహదారి అటవీ మార్గంలో జిన్నారం కొచ్చేరువు సమీపంలో గల స్టీల్ ఫ్యాక్టరీ మధ్య ప్రాంతంలో చిరుతపులి కనిపించిందని కొడిపల్లి శాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ ప్రద్యుమ్న రెడ్డి తెలిపారు. గుమ్మడిదల నుండి బొంతపల్లి గుండా జిన్నారం వైపు కారులో ప్రయాణిస్తున్న సందర్భంగా గోధుమ వర్ణపు చారలు గల పెద్ద చిరుతపులి ప్రధాన రహదారి గుండా అటవీ మార్గంలో కనిపించిందన్నారు. వెంటనే స్థానికులకు సమాచారం అందించినట్లు చెప్పారు. గతంలో కూడా గడ్డపోతారం పారిశ్రామిక వాడలో చిరుతపులి సంచరించింది. అటవీశాఖ అధికారులు దానిని పట్టి జూకు తరలించారు. జిన్నారం బొంతపల్లి ప్రధాన రహదారి గుండా వివిధ పరిశ్రమలో పనిచేయడానికి వందలాది మంది కార్మికులు వెళ్తుంటారు. జిన్నారం శివారులో కనిపించిన చిరుత ఎప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఉంది? ఎక్కడెక్కడ సంచరిస్తుంది? ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఈ దారి గుండా ప్రయాణం చేసేవాళ్ళు, గొర్ల బర్ల పశుల కాపరులు ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి సమయంలో పులి సంచరిస్తుందన్న సమాచారం తెలియడంతో జిన్నారం గుమ్మడిదల మండలాల పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన గురయ్యారు. కాగా పులి సంచరిస్తున్న విషయం గుమ్మడిదల ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినట్లు రైతు సంఘం అధ్యక్షులు నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి చెప్పారు.

ఆరా తీసిన ఫారెస్ట్ అధికారులు

బొంతపల్లి జిన్నారం అటవీ మార్గంలో చిరుతపులి సంచరిస్తుందన్న సమాచారం మేరకు బొంతపల్లి జిన్నారం శివారులో గల స్టీల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి తమ టీంతో కలిసి ఆరా తీసినట్లు గుమ్మడిదల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మంజిత్ సింగ్ తెలిపారు. అటవీ ప్రాంతంలో పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి చిరుత పులి సంచారానికి సంబంధించిన ఆనవాళ్లు లభించలేదన్నారు. చిరుతపులి సమాచారం తెలిస్తే తమకు చెప్పాలని ఫోన్ నెంబర్లను ఇచ్చినట్లు మంజిత్సింగ్ తెలిపారు.

మల్లన్న కల్యాణం రమణీయం





- పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రులు
- భారీగా హాజరైన భక్తజనం

నవ తెలంగాణ కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఆలయ సమీపంలోని తోటబావి వద్ద మల్లన్న కల్యాణ వేదిక మల్లికార్జున స్వామి నామస్మరణతో మారుమోగింది. ఈ వేడుకలను వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి దాదాపు 30 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు ఆలయ గర్భగుడిలో మూలవిరాట్‌కు కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. మేళతాళాలతో తోట బావి వద్ద గల మల్లన్న కల్యాణ మంటపంలోకి తెచ్చారు.

ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో సమర్పించారు. వీరశైవ ఆగమ శాస్త్ర సంప్రదాయం ప్రకారం మహాదేవుని, పడిగన్న గారి వంశస్తుల నుంచి మల్లన్న స్వామివారికి బలిజ మేడలమ్మ గొల కేతమ్మ, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు పుస్తె మట్టెలు, ముత్యాల తలంబ్రాలు ఒడిబియ్యం ఊరేగింపుగా మేళతాళాలతో వేదిక వద్దకు చేర్చారు. అనంతరం మల్లన్న కల్యాణ వేడుకలు మొదలయ్యాయి. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వారికి కేటాయించిన గ్యాలరీలో కూర్చుని తిలకించారు.

ఉజ్జయిని పీఠాధిపతి పర్యవేక్షణలో కల్యాణం

మల్లికార్జున స్వామి కల్యాణాన్ని మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు ఒక వెయ్యి ఎనిమిది సిద్ధ లింగ రాజదేశి కేంద్ర శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. మల్లికార్జునస్వామి బలిజ మేడలమ్మ గొల్ల కేతమ్మ కల్యాణ వేడుకలను పండితులు వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో మల్లన్న మూలవిరాట్ వద్ద వధువులు బలిజ మేడలమ్మ గొల్ల కేతమ్మల తరఫున మహాదేవుని వంశస్తులైన సాంబయ్య దంపతులు వరుడు శ్రీ మల్లికార్జున స్వామి తరఫున పడిగన్న గారి వంశస్థులు మల్లయ్య దంపతులు వేడుకలను నిర్వహించారు. అనంతరం తోట బావి వద్ద కల్యాణ వేదికలో వధువులు బలిజ మేడలమ్మ గొల్ల కేతమ్మ తరఫున మహాదేవుని వంశస్తులైన మహాదేవుని మనోహర్ దంపతులు వరుడు మల్లికార్జున స్వామి తరఫున పడిగన్న గారి వంశస్తులైన పడిగన్న గారి మల్లికార్జున్ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. మల్లన్న కల్యాణ వ్యాఖ్యాతలుగా డాక్టర్ మహంతయ్య, సాంబశివ శర్మ శశిభూషణ సిద్ధాంతులు వ్యవహరించారు. భక్తుల శివ నామస్మరణ మధ్య జయజయ ధ్వానాల నడుమ మధ్యాహ్నం 12 గంటల 28 నిమిషములకు మల్లికార్జున స్వామి బలిజ మేడలమ్మ గొల్ల కేతమ్మలను పరిణయమాడారు. మూడు గంటలపాటు జరిగిన







స్వామివారి కల్యాణ వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. స్వామివారి కల్యాణానికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డిపిఓ దేవకి దేవి, ఆర్డీవోలు, జిల్లా వ్యాప్తంగా పాలు శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు. మల్లన్న కల్యాణం సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మాజీ కొమ్మూరి ప్రతాపరెడ్డి,లు ఒక్కొక్కరు రూ.5116 లెక్కన కట్నంగా సమర్పించారు. సుస్మిత పటేల్ రూ.20,116 కట్నంగా స్వామి వారికి సమర్పించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం







- ఖీజర్‌యాఫై గోల్డ్‌కప్ టోర్నమెంట్ ఏర్పాటు అభినందనీయం
- సీనియర్ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ షద్రాక్

నవతెలంగాణ జహీరాబాద్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, జహీరాబాద్ లాంటి మారుమూల ప్రాంతంలో పెద్ద స్థాయిలో ఖీజర్‌యాఫై తన పేరు మీద గోల్డ్ కప్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని సీనియర్ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ షద్రాక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో ఖీజర్‌యాఫై గోల్డ్‌కప్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు మహమ్మద్ ఖీజరయాఫై, అశోక్ కుమార్‌తో కలిసి సినియర్ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ షద్రాక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో రెండోసారి ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు జాతీయస్థాయిలో క్రికెట్ ఆడిన క్రీడాకారులు జహీరాబాద్‌కు వచ్చి పోటీల్లో పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. మొదటి ఆల్పాతే మచిరెడ్డిపల్లి సీసీ, గుల్షన్ క్లబ్ బీదర్ మధ్య జరిగిన పోటీలో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న బీదర్, అల్పాతే సీసీ 17 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేశారు. 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బీదర్ జట్టు 17 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 131 పరుగులే చేయడంతో 27 పరుగుల తేడాతో బీదర్ ఓటమి పాలైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మొహమ్మద్ ఇంతియాజ్ (67) పరుగులు చేశారు. సీసీఏ హైదరాబాద్, పోలీస్ వారియర్స్ జహీరాబాద్ జట్టు మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీసీఏ 16 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేశారు. 167 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పోలీస్ వారియర్స్ 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 115 పరుగులే చేయడంతో 51 పరుగుల తేడాతో పోలీస్ జట్టు జహీరాబాద్ ఓటమి పాలైంది. బ్యాటింగ్‌లో రాణించిన మొహమ్మద్ లియకత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఇచ్చారు. కార్యక్రమంలో సికందర్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, తహ యాఫయి, అబూ యాఫాఇ, ఆదం యాఫాఈ,సయ్యద్ విహార్, అబ్దుల్లా, విజయ్ రాథోడ్, రాజు ,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాటం

- ఏషియన్ పెయింట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి

నవతెలంగాణ - పటాన్‌చెరు

ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో కార్మిక హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని ఏషియన్ పెయింట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారంపటాన్ చెరులో జరిగిన ఏషియన్ పెయింట్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఐఎన్‌టీయూసీ సర్వసభ్య సమావేశంలో కొల్కూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ గత మూడు వేతన ఒప్పందాల్లో జూనియర్ కార్మికునికి సుమారు రూ.22 వేల వేతనం, సీనియర్ కార్మికునికి సుమారు రూ.33 వేల వేతనం పెంచి 15 రోజుల గ్రాడ్యూటీని 21 రోజులకు చేసిన ఘనత డాక్టర్ జి సంజీవరెడ్డికే దక్కుతుందన్నారు. రెండుసార్లు అధ్యక్షులుగా గెలిచిన తీగల కృష్ణారెడ్డి ప్రతి వేతన ఒప్పందంలో ఆ సంఘం నాయకులు, అధ్యక్షులు మోసం చేయడం లేదా అధ్యక్షులు సంఘాన్ని మోసం చేయడం ఇద్దరు కలిసి కార్మికులను మోసం చేయడం తప్ప సాధించిందేమీ లేదని ఆరోపించారు. 2019 వేతన ఒప్పందంలో డాక్టర్ జి సంజీవరెడ్డి చేసిన వేతన ఒప్పందం కంటే 2021 సంవత్సరంలో తీగల కృష్ణారెడ్డి చేసిన వేతన ఒప్పందంలో వేతనాన్ని సెలవును సర్వీస్ వేయిటేజి, బోనస్ ఇలా అన్నింటినీ తగ్గించి చేశారని విమర్శించారు. వచ్చే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు మరొకసారి ఐఎన్‌టీయూసీని గెలిపించి



నట్లయితే కార్మికుల హక్కులను సాధించడంతో పాటు రాబోయే వేతన ఒప్పందం కార్మికులకు ప్రయోజనాత్మకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్మిక సంఘం అధ్యక్షుడు శుక్ల ఉపాధ్యక్షులు చంద్రమౌళి, కర్నాకర్ రెడ్డి, లక్ష్మణరావు, సూర్యకాంత్, జి ఎస్ రెడ్డి, ఎం శ్రీనివాస్, సోమిరెడ్డి, ఆర్కే సింగ్, సుబ్రహ్మణ్యం, సైమన్, జారప్ప, రాజశేఖర్, నాగరాజు గౌడ్, మహేష్, సతీష్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాస్థాయి సీనియర్ ఉమెన్ కబడ్డీ సెలక్షన్స్

నవ తెలంగాణ- గజ్వేల్

ఈ నెల 26వ తేదీ ఆదివారం సిద్దిపేట జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్ కబడ్డీ సెలక్షన్స్ గజ్వేల్ ఐవోసీ బిల్డింగ్ వెనకాల గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఆధార్ కార్డు పాస్ ఫొటోతో హాజరు కావాలని కోరారు. సిద్దిపేట జిల్లా స్థాయిలో ఎంపికైన మహిళా కబడ్డీ క్రీడాకారులు డిసెంబర్ 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 10వ తేదీ నుండి పంజాబ్ రాష్ట్రం లామ్రిన్ టెక్నో యూనివర్సిటీ లో జరుగబోయే జాతీయ స్థాయి సీనియర్ ఉమెన్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంట నోళ్ళ శివ కుమార్ తెలిపారు. ఆసక్తి గల సిద్దిపేట జిల్లా కబడ్డీ మహిళా క్రీడాకారులకు మంచి అవకాశం అని తెలియజేస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రేపు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు

నవ తెలంగాణ-సంగారెడ్డి: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూయువ కేంద్ర ఆధ్వర్యంలో ఈ నెల 9న సంగారెడ్డిలోని ప్రభుత్వ తార డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి ఆదివారం తెలిపారు. మైభారత్ - వికసిత్ భారత్ ఏ 2047 అనే అంశంపై జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో పాల్గొనడానికి 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు వారు అర్హులని తెలిపారు. మై భారత్ - వికసిత్ భారత్ ఏ2047 అనే అంశంపై 7 నిమిషాల వ్యవధిలో ఇంగ్లిష్/హిందీ/తెలుగు భాషలలో ఏదేని ఒక బాషలో ప్రసంగించాల్సి ఉంటుందన్నారు. గెలిచిన యువతకు ప్రశంసాపత్రం, మెమొంటో అందించడంతో పాటు విజేతలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.1 లక్ష, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి ఇద్దరు విజేతలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందిస్తారని తెలిపారు. వక్తృత్వ పోటీలలో పాల్గొనదల్చిన యువత జనవరి 8 సాయంత్రం 5 గంటల లోపు నెహ్రూ యువ కేంద్రంలో లేదా సెల్ ఫోన్ 9963056730లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను సన్మానించిన నాయకులు

నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘ భవనంలో రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యం లో రాష్ట్రంలో తొలి శాసన సభ్యుడిగా ఎన్నికైన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమను ఘనంగా సన్మానించినట్లు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య కురుమ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం సభ్యులు కంతులు రమేష్, జిల్లా యువత అధ్యక్షులు ప్రభాకర్, కొండపాక మండల అధ్యక్షులు ఎర్రోల్ల రమేష్, ఒగ్గు రాంబాబు, కరికే యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మగూడెంలో రాముడి అక్షింతల పంపిణీ

నవతెలంగాణ జిన్నారం

జిన్నారం మండల పరిధి లోని పెద్దమ్మగూడెం గ్రామంలో అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని హిందూ జాగృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం హిందూ ధర్మకర్తలు నిర్వహించారు. హిందూ జాగృతి సమితి జిన్నారం మండల అధ్యక్షులు వడ్ల ఆనంద్ చారి , బిజెపి సంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, బ్రహ్మేంద్ర, నరసింహారెడ్డి, ఆనంద్,.వార్డ్ సభ్యులు గొర్ల శ్రీనివాస్ యాదవ్, పర్ష మహేష్ యాదవ్, సుధాకర్, సర్వయ్య, ఎల్లన్న గారి వెంకటేష్, పుల్లపల్లి మహేష్ ,గొర్ల యాదయ్య,దుబ్బక మహేష్ యాదవ్, సీత రాజు యాదవ్, దుబ్బాక రాజు యాదవ్, పెద్దమ్మ గూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లె జాతరలతో ఆధ్యాత్మిక వాతావరణం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పల్లెల్లో నిర్వహించే జాతర్లతో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంటుందని ఎస్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాలలో నిర్వహించే జాతరలతో గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు గ్రామస్థుల మధ్య ఐక్యమత్యం వెల్లివిరుస్తుందన్నారు. అనాదిగా వస్తున్న మన ఉత్సవాలను, జాతరాలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మలన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ఆ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జాతర నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
సోమవారం | 08 జనవరి 2024 | www.navatelangana.com

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మంత్రి పరామర్శ



నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన చాకలి నాగరాజు గత కొన్ని నెలలుగా వెన్నుపూస సమస్యతో బాధపడుతూ హైదరాబాదులోని పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. అయినప్పటికీ వ్యాధి నయం కాలేదు. దాంతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతూ.. ఆసుపత్రులకు వెళ్లలేని దుస్థితిలో ఉన్నాడు. బాధితుడి పరిస్థితి తెల్సుకున్న రాష్ట్ర ఆరోగ్య, సైన్స్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ.. ఆదివారం సంగారెడ్డిలోని బాధితుడి అద్దె నివాసనికి వెళ్లి పరా మర్శించారు. నాగరాజుకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని బాధి తుడి కుటుంబానికి భరోసానిచ్చారు. వైద్యానికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట వట్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ పట్లోళ్ల సంగారెడ్డి, బాధితుని కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఖేడ్ మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఖేడ్ మున్సిపల్ చైర్మెన్ రుబీనా నజీబ్ ఆదివారంమర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నజీయర్ స్వామిని కలిసిన ఎమ్మెల్యే దంపతులు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, హిందూ మత గురువు చిన్న జీయర్ స్వామిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంప తులు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్ శ్రీ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామీని కలుసుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుండి మూడోసారి విజయం సాధించడం పట్ల స్వామి అభినం దనలు తెలిపారు. నియోజకవర్గంలో 180కి పైగా దేవాలయాలు నిర్మించడంతోపాటు, నూతన దేవాలయాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వెంట తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ లచ్చిరామ్ నాయక్, దాసు, సోదరుడి కుమారులు సంతోష్ గౌడ్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మీర్ఖాన్‌పేటలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ



నవతెలంగాణ-కల్హేర్


మండలంలోని మీర్ఖాన్‌పేట గ్రామంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మరియు రాపర్తి సర్పంచ్ శ్రావణ్ కుమార్, అల్లిఖాన్‌పల్లి సర్పంచ్, జాతీయ సీనియర్ క్రికెట్ ప్లేయర్ రవి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్న విషయం విధితమే. అయితే లీగ్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం నారాయణఖేడ్ లోకల్ టీం, నారాయణఖేడ్ ఎంప్లాయ్ టీం మధ్య జరిగిన మ్యాచ్‌ను రాపర్తి సర్పంచ్ శ్రావణ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఒక్కొక్క ప్లేయర్‌కు కరచాలనం చేస్తూ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎస్.యాకోబు, అల్లికాన్‌పల్లి సర్పంచ్ రవి,ఎంపైర్‌గా సీమోను, యోహాన్, రమేష్, అబ్రహం, భూపాల్, శ్రీకాంత్, ప్రముఖ రిపోర్టర్ ప్రవీణ్, రత్నయ, భూపతి, ప్లేయర్లు,తదితరులు,పాల్గొన్నారు

జంగంపేట గ్రామకంఠం భూముల్లో క్రయవిక్రయాలు?

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని జంగంపేట గ్రామంలో గ్రామ కంఠానికి సంబంధించిన భూముల్లో అక్రమంగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలువెత్తుతు న్నాయి. గతంలో ప్రభుత్వం కొందరికి కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన వ్యవహారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు స్థానిక నాయకుల కనుసన్నల్లో గ్రామ కంఠానికి సంబంధించిన భూముల క్రయవిక్రయాలు జోరందుకున్నాయని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ క్రయవిక్రయాల్లో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నా యంటూ జంగంపేట గ్రామస్తులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు తమ గ్రామం వైపు ఒకసారి చూసి.. అక్రమ క్రయ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

10కి పైగా ఎంపీ స్థానాలను గెలవడం ఖాయం



నవతెలంగాణ-జోగిపేట

రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో 10 స్థానాలు గెలవడం ఖాయమని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జోగిపేటలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో4 ఎంపీ స్థానాలను గెలుచుకున్నామని, రానున్న ఎంపీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లకు పైగా సాధించి, పది 10కి పైగా ఎంపీ స్థానాలను గెలుచుకుంటామన్నారు. పార్టీ ఆదేశిస్తే జహీరాబాద్ పార్ల మెంటు స్థానం నుంచి పోటీ చేస్తానని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాల్‌కల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జగన్నాథం, సతీష్‌రెడ్డి, అప్సర్, విజయెందర్‌రెడ్డి, శివ శంకర్ తదితరులున్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ





నవతెలంగాణ-మునిపల్లి


మండలంలోని మేళాసంఘం, పెద్దచెల్మెడ గ్రామాల్లో అయోధ్య రాముని అక్షింతలను ఆదివారం ఇంటింటికి పంపిణీ చేసారు. రామ తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలానికి సరఫరా అయినా అయోధ్య అక్షింతల ను ప్రజలకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుప్పా గారం సంగన్న, వార్డ్ సభ్యులు నాగిశెట్టి, సంగమేశ్వరస్వామి, పడమ టి సంగన్న, భీమిని మాణిక్యప్ప, రాజిరెడ్డి, హనుమాన్ మందిర్ కమిటీ సభ్యులు, శివాజీ సేన యువజన సంఘం పాల్గొన్నారు.



సదాశివపేట : సదాశివపేట పట్టణంలోని బట్టల బజార్ జైభజరంగ్ సేవా సంఘం శ్రీ ఆంజనేయ స్వామి దేవా లయ కమిటీ సభ్యులు, భక్తులు అయోధ్య రామమందిర ఆలయ అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.కార్య క్రమంలో అధ్యక్షులు బరాడి శివ, అర్చకులు మహేష్ స్వామి, ప్రధాన కార ్యదర్శి బాలరాజు, సహకార దర్శి రవి, ఆలయ అర్చకులు మహేష్ స్వామి, ప్రవీణ్ కుమార్, సూర్యకాంత్ పాల్గొన్నారు.



సదాశివపేట పట్టణంలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో అయోధ్య శ్రీ రామ చంద్రమూర్తి అక్షింతలు వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య కమంలో కౌన్సిలర్ గుండు రవి, బీఆర్ ఎస్ నాయకులు నాగుల విజయ కుమార్, బిక్షపతి, రాము, నాగరాజు, కొత్త రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం : మండల పరిధిలోని పెద్దమ్మ గూడెం గ్రామంలో అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని హిందూ జాగృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం హిందూ ధర్మకర్తలు నిర్వహించారు. హిందూ జాగృతి సమితి జిన్నారం మండల అధ్యక్షులు వడ్ల ఆనంద్ చారి, బీజేపీ సంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, బ్రహ్మేంద్ర, నరసింహారెడ్డి, ఆనంద్,.వార్డ్ సభ్యులు గొర్ల శ్రీనివాస్ యాదవ్, పర్ష మహేష్ యాదవ్, సుధాకర్, సర్వయ్య ఎల్లన్న గారి వెంకటేష్, పుల్లపల్లి మహేష్, గొర్ల యాదయ్య,దుబ్బక మహేష్ యాదవ్, సీత రాజు యాదవ్, దుబ్బాక రాజు యాదవ్, పెద్దమ్మ గూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడే బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని కాంకోల్‌లో నేడు(సోమవారం)విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుని విగ్రహ ఆవిష్కరణ ఉన్నదని లింగాయాత్ సమాజ్ సభ్యులు, పలువురు గ్రామస్తులు తెలిపారు. ప్రజలందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

కాలుష్య భూతం



కెమికల్ పరిశ్రమ రసాయన వ్యర్థాలతో ఝురాసంగం, కుప్పానగర్ గ్రామాలు విలవిల

- కలుషితమవుతున్న భూగర్భ జలాలు, పర్యావరణం
- కెమికల్ ప్లాంటుతో గ్రామీణుల జీవనం చిన్నాభిన్నం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు

పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య వ్యర్థాలతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న రసాయనిక ధూళి, వాయు కాలుష్యంతో చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. చెరువల్లోని నీరు కలుషితమై పంట పొలాలు నాశనమవుతున్నాయి. బోర్ మోటార్ల నుంచి కూడా కలుషిత నీరే వస్తుండడంతో.. దాగదానికి కూదా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్న పీసీబీ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని కుప్పానగర్, ఝురాసంగం గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కాలుష్య కోరల నుంచి తమ గ్రామాలను కాపాడాలని కోరుతున్నారు.

నవతెలంగాణ-ఝురాసంగం

సంగారెడ్డి జిల్లా ఝురాసంగం మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో శ్రీత కెమికల్ పరిశ్రమ ఉన్నది. ఈ పరిశ్రమ నుంచి వెలువడుతున్న రసాయనిక వ్యర్థాలతో సమీప గ్రామాల ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటు న్నారు. కుప్పానగర్ గ్రామ పంచాయతీలో సుమారు 3 వేల మంది జనాభా ఉండగా.. ఈ గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలోనే ఈ కెమికల్ పరిశ్రమను నెలకొల్పారు. అంతే కాకుండా 3 వేలకు పైగా జనాభా ఉన్న ఝురాసంగం గ్రామం కూడా ఈ పరిశ్రమకు కేవలం 1 కిలో మీటర్ దూరంలోనే ఈ గ్రామం ఉన్నది. ఈ రెండు గ్రామాల ప్రజలు అధిక శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే సదరు కెమికల్ పరిశ్రమ నుంచి వెదజల్లుతున్న వాయు కాలుష్యం రోజు రోజుకు పంజా విసురుతోంది. ఈ కంపెనీ నుంచి వెలువడుతున్న ప్రమాదకర రసాయనిక ధూళి, వాయుకాలుష్యం ఆయా గ్రామాలను చుట్టుముడుతూ స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆయ గ్రామాల పంచాయతీలోని పలువురు చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతు న్నారు. వాయు కాలుష్యంతో పాటు జల కాలుష్యం అధికమై గ్రామంలో పరిశ్రమ చుట్టు పక్కల ఎక్కడ బోరు వేసినా.. ఉప్పు నీరు, కలుషితనీరు వస్తున్నది. తాగేందుకు గుక్కెడు మంచి నీరు కూడా దొరకడం లేదు. చెరువు కాలువల్లో సాగు నీరు సైతం కలుషిత నీరుగా మారుతూ పంటలు సక్రమంగా పండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిలో తమ జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోం దని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో పలు దఫాలు నిరసన కార్యక్రమాలు చేపట్టినా కంపెనీల యాజమాన్యాలు కానీ, ప్రభుత్వా ధికారులు గాని పట్టించు కోలేదు. కంపెనీ పక్కన ఉన్న చెరువులో నీరు అంతా కలుషి తమై పోతున్నాయి. అంతే కాకుండా పరిశ్రమ వదులుతున్న వాయు కాలుష్యంతో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయిన కంపెనీ పెద్దలు పట్టించుకోవడం లేదు. అధికారులకు కనువిప్పు కలి గించేలా తమను కాపాడేదెరూ అంటూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలను చేపట్టేందుకు సమాయిత్తం అవుతున్నారు.



ఇబ్బందులు పడుతున్నాం.. చర్యలు తీసుకోవాలి



శ్రీత కెమికల్ కంపెనీ నుంచి రాను రాను కాలుష్యం అధికమవుతోంది. దుర్వాసన, రసాయనిక పదార్థాలతో అనేక రకాల వ్యాధులకు గురవుతున్నాం. జీవనానికి ఇబ్బందులు కల్గిస్తున్న ఈ పరిశ్రమపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– రాహుల్, ఝురాసంగం

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని జంగంపేట గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, స్థానిక నేతల బృందం ఎమ్మెల్యే జీఎంఆర్‌కు, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్‌లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి.. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గం లో దేవాలయాల అభివృద్ధి కి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని సమాజమంతా సస్యశ్యామలంగా పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు శంకరప్ప, మహేష్, ప్రభాకర్ రెడ్డి, జంగంపేట పాలకవర్గం ప్రతినిధులు, ఊట్ల సర్పంచ్ కొరివి ఆంజనేయులు, జిన్నారం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రాజేష్, నరేందర్, బిక్షపతి, గాండ్ల శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామి కల్యాణంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సోమేశ్వర స్వామి కల్యాణం, జాతర మహోత్సవంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొ రేటర్ అంజయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, టిఆర్ఎస్వి కోఆర్డినేటర్ కృష్ణకాంత్,యాదయ్య పాల్గొన్నారు.

బండల మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలో ప్రారంభమైన బండల మల్లన్న జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి పరచనున్నట్టు చెప్పారు. అనంతరం శ్రీరామ్ నగర్ కాలనీలోని దుర్గామాత ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, గోపాల్, చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

అంధుల అభివృద్ధి కోసం కృషి చేయాలి

ఎన్పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లేశం, కార్యదర్శి పోచయ్య.. ఘనంగా బ్రెయిలీ 215వ జయంతి



నవతెలంగాణ- జోగిపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎన్పీఆర్డీ సంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు తాళ్ల మల్లేశం, జిల్లా ప్రచార కార్యదర్శి మన్నె పోచయ్యలు డిమాండ్ చేశారు. ఆదివారం లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి సందర్భంగా జోగిపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోని అంధుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసి, ప్రత్యేక లిపిని కనిపెట్టి, అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కండ్లు కోల్పోయిన లూయిస్..వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలలో చదువుకున్నాన్నారు. ఆ క్రమంలోనే అంధుల కోసం ప్రత్యేక లిపిని కనుగొన్నారన్నారు. కాగా 2020నాటికి అంధత్వాన్ని నివారించాలని విహెచ్‌ఓ ప్రారంభించిన విజన్-2020లో భారత ప్రభుత్వం చేరిందని.. అయినప్పటికీ ప్రపంచంలోనే అత్యధిక అంధులు ఉన్న దేశం ఇండియా అని అన్నారు. బాల్యంలో అంధత్వం రాకుండా నివారించడంలో పాలకులు నేటికీ దృష్టి పెట్టలేకపోవడం బాధాకరమన్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 1-7 వరకు దేశవ్యాప్తంగా అంధత్వ నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. అంధత్వ నివారణకు 2021-22లో గుజరాత్ రాష్ట్రం రూ.4295.22కోట్లు ఖర్చు చేయాలని అంచనా వేసి కేవలం 1288.80కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. తెలంగాణలో రూ.1125.70 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించి 283.87కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.9096.50కోట్లు నిర్ణయించి 621.61 కోట్లు ఖర్చు చేశారన్నారు. గొప్పగా నిర్దేశిం చిన లక్ష్యాన్ని నెరవేర్చడంలో పాలకుల చిత్తశుద్ధి ఏ పాటిదో దీన్నిబట్టి అర్థం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధల కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. సామూహిక ప్రాం తాల్లో బ్రెయిలి లిపి అందుబాటులో ఉంచాలని, అన్ని రకాల అంధత్వం కలిగిన వారికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ సమాచారం, జీవోలు, చట్టాలు బ్రెయిలీ లిపిలో ముద్రించి అందుబాటులోకి తేవాలన్నారు. వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశలు కల్పించి ప్రోత్సా హించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సుభాష్ నాయక్ పాల్గొన్నారు.

కోనాపూర్‌లో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని కోనాపూర్‌లో శ్రీ పట్లోళ్ల శివ నాగప్ప మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ పట్లోళ్ల నందీశ్వర్ సారథ్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్, ఎంపీటీసీ అల్లం లలిత, గ్రామ సర్పంచ్ గోపులారం సంగమేశ్వర్ శోభారాణి, వీరశైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మధు శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం మాణిక్యం మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించడం ఎంతో ఆనందదాయ కమన్నారు. యువకులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు.స్వామి వివేకానంద ని స్ఫూర్తితో యువత రాణించి భారతదేశ ధీరత్వాన్ని చాటి చెప్పాలన్నారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్‌కు వివిధ జిల్లాల నుంచి 30 జట్టులు హాజరయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ పోటీలు కొనసాగుతాయి. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, ట్రోఫీ.. రెండో బహుమతి రూ.15 వేలు.. ట్రోఫీ అందించనున్నట్టు వారు తెలిపారు. ఫౌండేషన్ చైర్మెన్ పట్లోళ్ల చంద్రశేఖర్, కమిటీ సభ్యులు ధీంజ్, సంగమేశ్వర్, శ్రీనివాస్, రమేష్, రియాసద్, సుజనా కర్, శివకుమార్, దశరథ్, సంగమేశ్వర్, పర్యవేక్షణలో టోర్నమెంట్ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్లఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు సుధీర్‌రెడ్డి, చిల్ల మల్లన్న వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



నవతెలంగాణ-జిన్నారం

ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు వివరాలకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాలు అధికారులు చేపట్టారు. ఈ మేరకు మండల కేంద్రమైన జిన్నారంలోని మండల పరిషత్, ఎంఆర్వి సెంటర్లలో ఆన్లైన్ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగింది. కాగా డిసెంబర్ 28 నుంచి గ్రామ పంచాయతీలు మున్సిపాల్టీల వారిగా ప్రజలు ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే.

ఘనంగా భవన్స్ స్పోర్ట్స్ డే వేడుకలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భెల్ టౌన్షిప్‌లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు టౌన్షిప్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భవన్స్ హైదరాబాద్ కేంద్ర వైస్ చైర్మెన్ గోపాల కృష్ణన్, ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. పాఠశాల జెండాను ముఖ్య అతిథులు ఆవిష్కరించి లాంఛనంగా స్పోర్ట్స్ డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు ఇతర కార్యక్రమాలలో సైతం పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటాలన్నారు. రామచంద్రాపురం భెల్ లోని భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ ఎన్నో ఏండ్లుగా విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో సైతం భవన్స్ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అభినందించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థులు కన్నుల పండుగ్గా ప్రదర్శనలను ప్రదర్శించారు. చిన్నా రులు చేసిన క్రీడా నైపుణ్యం అక్కడికి వచ్చిన చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భవన్స్ హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ రమాదేవి, భవన్స్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మదన్ రావు, ప్రిన్సిపాల్ ఉమా శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, హెడ్ మిస్ట్రెస్ భాను నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





'12th ఫెయిల్' చిత్రాన్ని వీక్షించిన హాస్టల్ విద్యార్థులు



నవతెలంగాణ-జోగిపేట

విద్యార్థులకు ప్రేరణగా నిలిచే ఇటీవల విడుదలైన '12th ఫెయిల్' అనే చలనచిత్రాన్ని జోగిపేట ఎస్సీ బి హాస్టల్ విద్యార్థులు.. వార్డెన్ మల్లికార్జున్ సహకారంతో ఆదివారం వీక్షించారు. ఈ సినిమా భారతీయ హిందీ బయో గ్రాఫికల్ చలనచిత్రం కాగా.. విధు వినోద్ చోప్రా నిర్మించి, రాసి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ.. ఈ చలనచిత్రం విద్యార్థులకు ప్రేరణగా ఉంటుందని.. వారికి చూపించామన్నారు. ఇది అత్యంత పేదరికం అధిగమించి ఐపీఎస్ ఆఫీసర్‌గా మారిన మనోజ్ కుమార్ శర్మ నిజ జీవిత కథ అని ఆయన అన్నారు. ఈ సినిమా చూడడం ద్వారా విద్యార్థులు ప్రేరణ పొంది ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు పేదరికం అడ్డు కాదని భావిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
3
సోమవారం | 08 జనవరి 2024 | www.navatelangana.com

టిబేస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



మెదక్ జిల్లా తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సునీత రెడ్డి నివాసం వద్ద ఎమ్మెల్యే సునీత రెడ్డి చేతుల మీదుగా క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిబేస్ జిల్లా అధ్యక్షులు రామచందర్, ప్రధాన కార్యదర్శి మని రామ్ రాథోడ్, మెదక్ డివిజన్ అధ్యక్షులు దేవి సింగ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నర్సాపూర్ మండల అధ్యక్షులు చెన్నా నాయక్, నాయకులు గణేష్, చందర్, మోతిలాల్, లాలు, పంతులు, రవీందర్, భీమ్లా, రాజు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నర్సాపూర్



పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల శ్రీ దేవి వన దుర్గా భవానీ మాతను ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భోగచంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, పంబల బిక్షపతి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవ తెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వడ్ల శ్రీనివాస్ చారి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆదివారం సికింద్లాపూర్ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. తన వంతు సహాయంగా రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్, నర్సింలు, నరేందర్, నరేష్ కుమార్, వెంకటేష్, మల్లేష్, శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శిగా శ్రీకాంత్



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా కార్యదర్శిగా గుడ్ల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. టీఆర్‌టీఎఫ్ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీకాంత్‌కు పలువురు హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. టీఆర్‌టీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శిగా తనను ఎన్నుకున్నందుకు వారికి శ్రీకాంత్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. టీఆర్‌టీఎఫ్ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. రంగనాయక్ సాగర్ గెస్ట్ హౌస్‌లో దుబ్బాక నియోజక వర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మిరుదొడ్డి మండల కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఎండీ అర్షద్, ప్రధాన కార్యదర్శి పూధురీ మహేష్, జాయింట్ సెక్రటరీ ఎల్లం, శ్రీనివాస్, రాజు, అల్వాల్ గ్రామ సర్పంచ్ కిష్టయ్య, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్మెన్ సమావేశాల్లో పాల్గొన్న రేపాక తిరుపతి



నవతెలంగాణ-తొగుట

దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనుబంధ సంస్థలు కలిసి కట్టుగా పని చేయాలని రాష్ట్ర ఫిషర్ మెన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ జాతీయ మత్స్యశాఖ విభాగం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో నేషనల్ చైర్మన్ ఫెర్నాండో ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తెలంగాణ ఫిషర్మెన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయి కుమార్‌తో కలిసి పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనుబంధ సంస్థలు అన్ని పని చేయాలన్నా రు. భారత్ జోడో న్యాయ యాత్రలో ఫిషర్‌మెన్ కాంగ్రెస్ నాయకులు అందరూ పాల్గొనాలని కోరారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అక్రమ గోవా మద్యం పట్టివేత



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఆదివారం ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టగా గోవా రాష్ట్రం నుంచి హైదరాబాదుకు వెళుతున్న ట్రావెల్స్‌లో గోవా మద్యం పట్టుబడింది. అక్రమంగా తరలిస్తున్న 70 లీటర్ల మద్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ట్రావెల్స్ డ్రైవర్ ఉల్లాస్, శ్రీధర్, అబసాహెబ్‌లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రయాణికుల సంఖ్యను పెంచుకునేందుకుగాను తక్కువ ధరకు దొరికే గోవా మద్యం అక్రమ రవాణా విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్టు విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, సీఐలు మోహన్ కుమార్, రమేష్ రెడ్డి, ఎ. రజిత, ఎస్ఐ విశ్వనాథ్, అనిల్ కుమార్, హెచ్‌సిలు విఠల్, ఎండి ఆజామ్ హుస్సేన్, సిబ్బంది రామారావు నాయక్, మల్కయ్య, గోపాల్, అనిల్ కుమార్, కరీం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరపాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గురుకుల కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం రంజాన్ కళాశాల వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే విద్యార్థిని కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో బైపిసి చదువుతున్న విద్యార్థి క్లాస్ రూమ్‌లో చనిపోవడం జరిగింది. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థిని విద్యార్థుల మరణాలకు గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులంతా పేద విద్యార్థులే, వారిపట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదన్నారు. అమ్మాయి కళాశాలలో ఉరివేసుకొని చనిపోయిన ఘటనపై ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరపాలని, కారుకులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా, మూడు ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అంత్యక్రియల కోసం లక్ష రూపాయలు, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రజాసంఘ నాయకులు, విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నాయకులు కళాశాల వద్ద డిమాండ్ చేశారు. దీంతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తూ డిఎస్పి చేతుల మీదుగా పేరెంట్స్‌కు సర్కులర్ (లెటర్) అందించడం జరిగింది. ఇప్పటికైనా గురుకులాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల ఆర్‌సిఓ భీమయ్య, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏరియా కార్యదర్శి రాజేష్, రాఘవేందర్, మల్లేష్, హతీక్, విష్ణువర్ధన్, గణేష్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

నిజాంపేట, రజాక్ పల్లిలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర





నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద, రజాక్ పల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట రుణాలపై తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నామన్నారు సరియైన సమయంలో వడ్డీ, అసలు చెల్లించాలన్నారు. జెడ్పీటీసీ పంజ విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉజ్వల పథకం గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మరుగుదొడ్లను, ఇంకుడు గుంతలను, డంపింగ్ యార్డ్, వైకుంఠధామాలలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్నారు. ఎం.ఎల్.హెచ్.పి సంధ్య మాట్లాడుతూ హెల్త్ సెంటర్‌లో గ్రామస్తులు ప్రతినెల వారి ఆరోగ్యం గురించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ కార్డులు కూడా చేయించుకోవాలన్నారు. బీపీ షుగర్ లాంటి పరీక్షలను చేసి ఉచిత మాత్రలను ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యవసాయ సీఈవో కావేరి మాట్లాడుతూ ప్రధానమంత్రి రైతు బంధు సంవత్సరానికి రూ.6000 రైతుల ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి రైతుకు నాలుగు నెలలకు ఒకసారి రూ.2000 చొప్పున వేయడం జరుగుతుందన్నారు. సీసీ స్వరూప మాట్లాడుతూ మహిళలకు తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాస్, మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్, మహంకాళి నరేష్, గ్రామ సర్పంచ్ అనూష లక్ష్మీ నరసింహులు, ఉప సర్పంచ్ బాబు, పంచాయతీ సెక్రెటరీ నరసింహులు, సిహెచ్ఓ లక్ష్మి, ఏఎన్ఎం అనురాధ, బాలమణి, ఆశా వర్కర్లు బండారి లక్ష్మి, అనిత, కొమ్మాట బాలమణి, అంగన్వాడీ టీచర్లు అరుణశ్రీ, దుర్గేశ్వరి, మానెమ్మ, రేణుక, సుగుణ, రజాక్ పల్లి సర్పంచ్ ధర్మ సునీత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీటీ పోయింది..కంకర మిగిలింది!

- గుంతల మయంగా వనంపల్లి-ఝురాసంగం బీటీ రోడ్డు
- ఐదు కోట్లతో నిర్మాణం..ఆరు నెలలకే ధ్వంసం..!
- స్కిట్ అయి ఆస్పత్రి పాలవుతున్న ద్విచక్ర వాహనదారులు
- ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోని వైనం

నవతెలంగాణ-ఝురాసంగం

బీటీ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బంలు పడుతున్నారు. ఝురాసంగం నుంచి వయా సిద్దాపూర్ మీదుగా వనంపల్లి గ్రామం వరకు ఉన్న రోడ్డు 2017లో నిర్మించారు. ఏళ్లుగా నిర్వాహణ లేక బీటీ కొట్టుకుపోయి, కంకర తేలి మట్టి రోడ్డు అనిపించేలా మారింది. ఎక్కడిక్కడ గుంతల పడడం, కంకర తేలి వాహనాల టైర్లు పంక్చరవడం వంటి సమస్యలతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ రోడ్డుకు సుమారు రూ.5 కోట్లను ఖర్చు చేసి అప్పట్లో నిర్మించారు.



నాలుగు కాలాలపాటు మన్నికగా ఉండాల్సిన ఈ రోడ్డు ఆరు నెలలు గడవకముందే అధ్వాన్నంగా మారి ప్రజలు దానిపై తిరుగలేని పరిస్థితి ఏర్పడిందంటే ఎంత నాసిరకంగా చేపట్టారో అర్థమవుతుంది. నిర్మాణం పూర్తి అయిన తర్వాత తదుపరి ఐదు సంవత్సరాలు గ్యారెంటీ ఇస్తూ కాంటాక్ట్ అగ్రిమెంట్ జరిగినప్పటికీ తర్వాత ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టకపోవడం శోచనీయం. వనంపల్లి నుంచి సిద్దాపూర్ మీదుగా ఝురాసంగం వరకు 11.40 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.4.85 కోట్లు మంజూరయ్యాయి. 24-11-2014 తేదీన చేపట్టి 23-11-2015 పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకున్నారు. సమయానికి పని పూర్తి చేసి 22-11-2020వ తేదీ వరకు ఈ రోడ్డుకు గ్యారెంటీ ఇవ్వడం జరిగింది. కానీ



కాంట్రాక్టర్ సమయానికి పని చేయకుండా నిర్లక్ష్యం చేసి దాదాపు రెండు సంవత్సరాల తర్వాత రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. వనంపల్లి నుంచి సిద్దాపూర్, ఝురాసంగం, మిర్జాపూర్ వైపు ముందుగా అక్కడక్కడ కల్వర్టులు సైడ్ వాల్స్ నిర్మించారు. తదుపరి బీటీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. ఈ బీటీ రోడ్డు పనులు నాసిరకంగా చేపట్టడంతో ఆరు నెలలు



తిరగకుండానే రోడ్డు ధ్వంసమై కంకర తేలి ప్రజల కష్టాలు తిరిగి పునరావృతమయ్యాయి. గతంలో ఉన్న బీటీ రోడ్డు కంటే తిరిగి నిర్మించిన బీటీ రోడ్డు అధ్వానంగా మారడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం అటు ప్రయాణించే భోజ్యా నాయక్ తండ పంచాయతీ పరిధిలోని రాంచందర్, పుర్యానాయక్, టొప్యాయనాయక్ తండ ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఐదు సంవత్సరాల గ్యారెంటీ ఉన్నప్పటికీ నిర్వాణ నిధులు ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదు. ప్రస్తుతం ఈ రోడ్డు దీనావస్థలో ఉండడంతో ప్రజలు తరచుగా ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాక ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనాలు కూడా తరచుగా మరమ్మత్తుకొస్తున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వనంపల్లి సర్పంచ్ చిన్న సంగయ్య విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మా గోస ఆలకించండి సీఎం సారూ..

నవ తెలంగాణ-రాయపోల్



ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నో హామీలను ఇచ్చి పది సంవత్సరాలు పరిపాలించినగాని, ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడితే తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు నిరాశే ఎదురవుతుంది. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తలామునకులయ్యాయి కానీ, ఉద్యోగుల సమస్యలను పట్టించుకునే నాధుడే లేడు. మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో మహిళలు బస్సులలో ప్రయాణం చేస్తున్నారు. జనాభాకు సరిపడా బస్సులు లేకపోవడం, ఒకే బస్సులోనే పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించడంతో డ్రైవర్, కండక్టర్లకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కావడంతో చాలా బస్సులలో సీట్లు దొరకని పరిస్థితులు ఎదురవుతున్నాయి. బస్సులో సీట్ కోసం అక్కడక్కడ తగాదాలు కూడా జరుగుతున్నాయి. పురుషులకైతే సీటు దొరకడం గగనమైంది. ఇలాంటి పరిస్థితులలో ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలు మరింత ఎక్కువవుతున్నాయి. డ్యూటీ సమయం కంటే అధిక సమయం ప్రతిరోజు డ్యూటీ చేయాల్సి వస్తుంది. ఎక్కువ సమయం డ్యూటీ చేస్తే ఓటి చెల్లించడంలో తారతమ్యం ఉంటుంది. ఆర్టీసీ ఉద్యోగులు అనారోగ్యానికి గురయితే కూడా సెలవులు దొరకని పరిస్థితులలో ఉద్యోగులు నౌకరు చేస్తున్నారు. ఉద్యోగులు అనారోగ్యానికి గురైతే తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో అడ్మిట్ అయితే తప్ప సెలవు ఇవ్వడం లేదు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటే సెలవు వర్తించడం లేదు. బస్ డిపోల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాసినా సెలవు మంజూరు చేయడం లేదు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన మహిళ కండక్టర్ గత మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ, చికిత్స తీసుకుంటూ విధులకు హాజరవుతున్నారు. కానీ సెలవు మాత్రం ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు పిఆర్సి ఊసే లేదు. ఇలా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రతి నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తున్నారు. అలాంటి ఆర్టీసీ ఉద్యోగుల గురించి నూతనంగా ఏర్పడిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, మా గోస ఆలకించి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ సారును వేడుకుంటున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

తండ్రి కొడుకుల మధ్య జరిగిన గొడవలో తండ్రికి గాయాలవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిన్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిన్‌పూర్ గ్రామానికి చెందిన బత్తిని యాదగిరికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య భూలక్ష్మీకి ఒక కుమారుడు శ్రీకాంత్ ఉన్నాడు. గత కొన్నేళ్ల కిందట భూలక్ష్మీ యాదగిరిని వదిలి వెళ్లడంతో అతను దేవవ్వను రెండో పెళ్లి చేసుకున్నాడు. కాగా రెండో భార్య దేవవ్వకు ఇద్దరు కొడుకులు దుర్గాప్రసాద్, సిద్దార్థలు ఉన్నారు. యాదగిరి గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసగా మారాడు. రోజు మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సమయంలో యాదగిరి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఇంట్లో వారితో గొడవ పడ్డాడు. దీంతో రెండో భార్య కొడుకు అయిన దుర్గాప్రసాద్ క్రికెట్ బ్యాట్‌తో యాదగిరి ఛాతీపై బలంగా కొట్టాడు. యాదగిరి కింద పడిపోగా కుటుంబీకులు స్థానికుల సాయంతో వెంటనే 108 వాహనంలో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి సమయంలో యాదగిరి మృతి చెందాడు. తన తండ్రి మృతికి కారణమైన దుర్గాప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని మొదటి భార్య భూలక్ష్మి కొడుకు శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రావాలి



బడేపహాలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుతూ పట్టణ యూత్ అధ్యక్షులు నవాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. నిజాంబాద్ జిల్లా వర్ని మండలం బడేపహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రజా సమస్యలపై స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సజ్జ, అఖిల్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవ తెలంగాణ-మిరుదొడ్డి

అసంఘటిత కార్మికులకు సంక్షేమం, అభివృద్ధి, రక్షణలకు కల్పించిన సామాజి భద్రత 2008 చట్టాన్ని అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శిపి.శంకర్ డిమాండ్ చేశారు. జాతీయ ప్రజా ఉద్యమాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అసంఘటిత కార్మికుల హక్కులు, పోరాటాలపై జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయకుండా 47 చట్టాలను నాలుగు లెబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందన్నారు. గ్రామీణ ఉపాధి హామి చట్టాన్ని కేంద్రం ఉల్లంఘిస్తుందన్నారు. పట్టణాలలో జీవిస్తున్న అసంఘటిత కార్మకులకు పట్టణ ఉపాధి హామి చట్టాన్ని అమలు చేయాలన్నారు. గృహ, భవన నిర్మాణ, వీధి వ్యాపారుల, గిగ్ ప్లాట్ ఫాం, వలస కార్మికులకు ప్రభుత్వమే హక్కుగా పని కల్పించి కనీస వేతనాలను అందించాలన్నారు. ప్రమాద, ఆరోగ్య భీమా పథకాలను అమలు చేయాలన్నారు. కరోనా మహమ్మారి వల్ల బడి మానేసిన పిల్లలు డ్రాపౌట్స్‌గా మారిన పిల్లలందరికి ఎలాంటి షరతులు లేకుండా విద్యను హక్కుగా అమలు చేయాలన్నారు. పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున అసంఘటిత కార్మికుల ఎన్నికల ఎజెండాను రూపొందించి జనవరి 26న గణతంత్ర దినోత్సవం నాడు విడుదల చేసి రాజకీయ పార్టీలకు అందించాలని జాతీయ సదస్సు నిర్ణయించిందన్నారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిన్నారంలో సమతా సైనిక్ దళ్ సమావేశం

నవతెలంగాణ- జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారంలో ఆదివారం ఆల్ ఇండియా సమతా సైనిక్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ నిర్వహణ కార్యదర్శి, దళిత రత్న మాదారం కాసాల అంబదాస్ ఆధ్వర్యంలో స్థానిక సమతా సైనిక్ దళ్ శ్రేణుల బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై భీమ్ అంటూ నినదించారు. సమతా సైనికుల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు దళిత రత్న కాసాల అంబదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమతా సైనిక్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
సోమవారం 08 జనవరి 2024 www.navatelangana.com

రెండోరోజు ఆర్టీసీ వన భోజన మహోత్సవాలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పుడు విధి నిర్వహణలో కష్టపడుతున్నారని ఉద్దేశంతో టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు వన భోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం హుస్నాబాద్‌లో రెండోరోజు వన భోజన మహోత్సవాన్ని డిపో మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో తీరిక లేకుండా కష్టపడుతున్నారని, ఉపశమనం కలిగించాలనే ఆలోచనలతో వనభోజనాలు కార్యక్రమం నిర్వహించినట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. డిపోలో ఉద్యోగులు అందరూ ఆట పాటల తో చాలా సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు సూపర్డెంట్ శ్రీధర్, నరసయ్య సామ్యూల్, లక్ష్మారెడ్డి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రామ నామానికి ఎదురులేదు



నవతెలంగాణ-గజ్వేల్

రామ నామాన్ని మించిన మహా మంత్రం మరొకటి లేదని శ్రీరామరక్ష స్తోత్ర మహా మంత్రాన్ని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్య ంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు సామూహికంగా భక్తితో పరాయనాన్ని కృష్ణాలయంలోని రామాలయంలో పూర్తి చేసి అనంతరం సీతారాములకు అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం కృష్ణాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. అయోధ్య రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠలో భాగంగా అందరూ రామనామ స్మరణలో పాలు పంచుకోవాలనే సంకల్ప దీక్షతో 108మంది భక్తులచే శ్రీరామరక్ష స్తోత్ర పరాయనాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రామచంద్ర, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, ఉప్పల మధు, దొంతుల దశరథం, ధార రాంచంద్రం, బండి శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, నేతి నాగేంద్రం పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

దైవం జ్ఞాన స్వరూపం

పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి



నవతెలంగాణ-కొండపాక

దైవం జ్ఞాన స్వరూపమని ప్రతి ఒక వ్యక్తి భక్తి భావాన్ని పెంపొందించుకుంటే జ్ఞాన సముపార్జన కలుగుతుందని పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి అన్నారు. కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద మండల పూజా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ప్రతి వ్యక్తి ఇచ్చా వ్యామోహాలను వదులుకుంటే పరమాత్మను చేరుకోవడానికి మార్గం దొరుకుతుందన్నారు. మంచి అలవాట్లను కలిగి ఉండాలని తెలిపారు. భక్తిని పెంచుకుంటే జ్ఞానం వైరాగ్యం వస్తాయన్నారు. ప్రపంచంలో అన్ని వైరాగ్యంతోనే ముడిపడి ఉన్నాయని తెలిపారు. మంచివాడిని కలిస్తే చెడ్డవారెవరో తెలుస్తారని, చెడ్డవారితో సాన్నిహిత్యం చేస్తే మంచి వారెవరో తెలుస్తారన్నారు. ధనాన్ని వినియోగిస్తే దరిద్రం వదులుతుందని తెలిపారు. కంఠంలోని ఉన్న పరమాత్మను తెలుసుకున్న వాడే యోగి అని తెలిపారు. పరమాత్మ ప్రేరణతో మంచి పనులు చేయాలని సూచించారు. సందర్భంగా దేవాలయంలో పంచసూక్త హోమములు, మూల మంత్ర హోమములు, బలిహరణ పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. శివ పార్వతుల కళ్యాణం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అయిత నాగరాజు గట్టు రవీందర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికి రాములోరి అక్షింతలు









నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని హరిప్రియనగర్, టీచర్స్ కాలనీలల్లో ఇంటింటికి అయోధ్య శ్రీరామ అక్షింతలు వితరణ చేసినట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం అయన మాట్లాడుతూ 22న ప్రతి ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలని, ఎన్నో దశాబ్దాల కల 22న నెరవేర బోతుందని, పెద్ద పండుగ వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ అరవింద్ రెడ్డి, కాలనీ పెద్దలు రాంరెడ్డి, మల్లారెడ్డి, బూర మల్లేశం, భాస్కర్ రెడ్డి, దుర్గారెడ్డి, సురేందర్ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాములు, జనార్ధన్ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో అయోధ్య ప్రాణ ప్రతిష్ట పూజిత అక్షింతల ఊరేగింపు మహోత్సవాన్ని సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు అదివారం ప్రారంభించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాద్యాలతో అయోధ్య అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఎంపీటీసీ నల్లగొండ లక్ష్మి,వార్డ్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ఆదివారం అయోధ్య శ్రీ సీతా రాముల పూజిత అక్షింతలను మంగళవాయిద్యంతో, జై శ్రీరామ్ నినాదాలతో పాటలు పాడుతూ భజనలు నృత్యాలు చేస్తూ సాయి భార్గవ పంతులు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. ఇంటింటికి అయోధ్య పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పంతులు మాట్లాడుతూ అయోధ్య నుండి చేరుకున్న శ్రీరాములవారి అక్షింతలు హిందువుల 500 ఏళ్ల చిరకాల కోరిక అయోధ్య శ్రీరాములవారి రామాలయం పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 22న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు 5 దీపాలు వెలిగించాలని అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బి జె పి పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల రాజయ్య,ఆకుల నరేష్ , ఆకుల ప్రభాకర్, మహేశ్ చారీ, పాల రమేష్ గౌడ్,జర్నలిస్ట్ బాల్ రాజు గౌడ్, కనుక రాజ్ గౌడ్, నరేందర్ రెడ్డి, యాదగిరి గౌడ్, మహిళలు,చిన్నారులు,యువకులు, రామ భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ముత్రాజ్‌పల్లికి చేరిన రాములోరి అక్షింతలకు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గల్లీలలో శోభాయాత్రగా ఇంటింటికి అక్షింతలు, కాషాయ జెండాలు, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మి కిషన్ రెడ్డి, శ్యామలమల్లేష్ యాదవ్, బిజెపి నాయకులు మనోహర్ యాదవ్, రేగొండ, శివకుమార్, ఆర్కే యాదవ్, హిందూ సంఘం నాయకులు గడ్డం మల్లేశం, ప్రవీణ్ గౌడ్, మార్కంటి రవి, మాదగారి మల్లేష్ం, మాదగారి బాబు, బోంస్ల సాయి, శివ, కైలస నరేష్, నత్తి నరేష్, చింతకింది యాదగిరి పాల్గొన్నారు.

అవినీతి అవిశ్వాసంపై చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

భారీగా అవినీతికి పాల్పడి కోట్లాది రూపాయలు దండుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డిలు దొంగతనం చేసి దొంగేదొంగ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, వారు చేసిన అవినీతి, అవిశ్వాసంపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్లు 967, 19లో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు కబ్జా చేయలేదా? వాటి ఆధారాలు తన వద్ద ఉన్నాయని అన్నారు. వాస్తవాలు నిరూపిస్తే స్వచ్ఛందంగా మీ ఆస్తులు ప్రభుత్వానికి రాసి ఇచ్చి కోర్టులో లొంగిపోతారా అని అన్నారు. వాస్తవాలు నిరూపించకుంటే తాను జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, దమ్ముంటే మీరు అవినీతికి పాల్పడలేదని, కబ్జాలు చేయలేదని నిరూపించుకునే సత్తా ఉందా అని అన్నారు. 1340 లో కొండం సంపత్ రెడ్డి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి కబ్జాలపై మరింత ఆధారాలు సేకరిస్తున్నానని మీ అవినీతి చిట్టా త్వరలోనే ప్రజలకు వివరిస్తానని అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ప్రధాన కార్యదర్శి గాదారి మధు, సిద్దిపేట యువజన పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశద్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు సలీం, ఫయాజ్ నజ్జు, మహేష్, చింటూ, రాజశేఖర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలి

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్
- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం





నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కాలేదని నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిషలు కృషి చేయాలని, స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం పోతారంఎస్ గ్రామంలోని శుభం గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్, హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, రాబోయే స్థానిక సంస్థల, పార్లమెంటు ఎన్నికల సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. గత పది సంవత్సరాలలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరపున ప్రశ్నించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలోలేమని కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగి సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

విద్యార్థి దశ అనేది ప్రతి ఒక్కరికి గొప్ప వరమని 2003-2005 ఎంపీసీ విశ్వతేజ కాలేజ్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్ సమీపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 20సంవత్సరాల తర్వాత కలుసుకున్న 2003 - 2005 ఇంటర్మీడియట్ ఎంపీసీ బ్యాచ్ విశ్వతేజ జూనియర్ కళాశాల గజ్వేల్ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ సమీపంలో విద్యార్థులు కలుసుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత బిజీ బిజీ లైఫ్ లో అందరూ ఒక చోట కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పటి గత స్మృతులను అందరూ గుర్తు చేసు కున్నారు. అందరూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థితిలో నిలిచినందుకు స్నేహితులందరూ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారన్నారు. వివిధ రంగ ఉద్యోగాలు, ఐటి ఉద్యోగాలు, అధ్యాపకులు, లెక్చరర్స్, ప్రైవేట్ రంగం, వ్యాపారం లో స్థిరపడ్డ విద్యార్థులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో నవీన్, సందీప్,శ్యాం, వేణు, సంతోష్, ఝాన్సీ, సంధ్య, సరస్వతి, శ్రవణ్ ,శ్రీనివాస్, మాధవి, నాగమణి, శ్రీలత, సుకన్య చంద్రశేఖర్, ఆంజనేయులు, ప్రవీణ్, వేణుమాధవ్, ప్రశాంత్, శుక్రుత్, శివకుమార్, రాజిరెడ్డి, మల్లేష్ యాదవ్, అరుణ, కవిత, వినోద, సిహెచ్ సంధ్యతదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర మూర్తి భావితరానికి ఆదర్శం



నవతెలంగాణ కొండపాక

దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టి భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సేవ చేయాలనే తపనతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కొండపాక మండలం దుద్దెడ శంభు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రంమూర్తి శర్మ భావితరానికి ఆదర్శప్రాయుడని పలువురు ఆయన సేవలను కొనియాడారు. దుద్దెడ శంభు దేవాలయ ఆవరణలో రామచంద్ర మూర్తి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడారు. శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో రామచంద్ర మూర్తి చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మార్గదర్శనంలో శంభు దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తూ గ్రామంలో సమాజ సేవ, పాఠశాలల అభివృద్ధికి ముందుకు సాగుతామని ట్రస్టీలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్ గౌడ్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పెద్దంకుల శ్రీనివాస్, అనంతల నరేందర్, సలహాదారు నర్ర రాఘవరెడ్డి, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, బంధువులు రఘురామశర్మ, విఠల్ శర్మ లక్ష్మీ నరసింహం, నాయకులు నూనె కుమార్ యాదవ్ ,ట్రస్టు సభ్యులు మంచాల చిన్న శ్రీనివాస్, బూరుగుల వెంకటరమణ, దేశాయిరెడ్డి, రాజయ్య, కోట శ్రీనివాసశర్మ, అర్చకులు వ్యాస నారాయణ, తమ్మలి శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు

దాచారంలో ముందస్తుగా ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దాచారం గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ కొలిపాక రాజు అధ్వర్యంలో ముందస్తుగా ముగ్గుల పోటీలు ఆదివారం రామాలయం వద్ద నిర్వహించారు. సుమారు 55 మంది మహిళలు ఉత్సాహకంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మహిళ లతో పాటు పోటీల్లో పాల్గొన్న వారికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, అజయ్ వర్మపోతుగంటి సుజాత రెడ్డి బహుమతులందజేశారు. బీజేపీ దళిత మోర్చ జిల్లాధ్యక్షుడు దీటీ పాల్గొన్నారు.

ఆదర్శ హమాలీ సంఘం గౌరవాధ్యక్షుడిగా బొలిశెట్టి శివయ్య



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఆదర్శ హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్యను ఆదివారం సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శివయ్య మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలోని ఆదర్శ హమాలీ సంఘం ఏర్పడి చాలా ఏళ్లు అవుతుందన్నారు. హమాలీల సమస్యల కోసం సంఘ సంక్షేమ కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అధ్యక్షుడు మౌటం సారయ్య, కార్యదర్శి చెన్నవెని దేవేందర్ పాల్గొన్నారు.

మత్స్య సంపద మరింత వృద్ధి చెందాలి

పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం.విజయ్ గుప్తా



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

రాష్ట్రంలో మత్స్య సంపద మరింత వృద్ధి చెందాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం విజయ్ గుప్తా అన్నారు. ఆదివారం హైదరాబాద్ లకిడికపూల్ ఫిషరీస్ భవన్ కె.ఎల్ ప్రసాద్ ఆడిటోరియంలో జిల్లా కన్వీనర్లకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఫిషరీస్ సొసైటీ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ ఆధ్వర్యంలో పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మత్స్యకారులు నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. పిట్టల రవీందర్ 33 జిల్లాలవారీగా ఫిషరీస్ కన్వీనర్లను నియమించి నియామక పత్రాలు అందజేశారని తెలిపారు. సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా అక్కారం సత్తయ్యను నియమించినట్లు తెలిపారు. అక్కారం సత్తయ్యకు ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన మత్స్యకారులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో. జిల్లా డైరెక్టర్, ప్రజ్ఞాపూర్ మత్స్యశాఖ అధ్యక్షుడు ఎల్లా మల్లేశం, శ్రీరామ్ కృష్ణ ముదిరాజ్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్లా వెంకటేశం, శ్రీరామ్ శ్రీనివాస్ ముదిరాజ్, బెధరమైన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలలో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-మర్కుక్

క్రీడలలో గెలుపోటములు సహజమని, ఆటలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ రూ.11,111 ఇవ్వగా, ద్వితీయ బహుమతి మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ బహుమతి రూ.5,111 నగదు బహుమతులను ప్రతాప్ రెడ్డి ప్రదానం చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో పాములపర్తి, గంగాపూర్ జట్టులు తలపడగా పాముల పర్తి జట్టు విజేతగా నిలిచింది. మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్,జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్ ,వైస్ ఎంపీపీ ,మర్కుక్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్ జగదేవపూర్ పీఏసీ ఎస్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు, సర్పంచులు భాస్కర్, పుట్ట మంజుల నర్సిం లు, అప్పాల స్వరూప మల్లేశం,వంటి మామిడి మార్కెట్ కమిటి డైరెక్టర్ కటకం ప్రవీణ్ చారి, బీఆర్ఎస్ ఎర్రవల్లి గ్రామాధ్యక్షులు జి. వెంకట్ రెడ్డి, నాయకులు పాములపర్తి కర్ణాకర్, చెక్కల కర్ణాకర్, మర్కుక్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్. కృష్ణ, వైస్ చైర్మన్ రవీందర్, ప్రధాన కార్యదర్శి ఐలేని యాదవ్, ప్రచార కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి హరిబాబు, సలహాదారుల మల్లేష్ సంతోష్ తదితరులున్నారు.

ఆటో కార్మికుల జీవితం ఆగం



నవతెలంగాణ-నంగునూరు

మహాలక్ష్మి పథకం పెట్టి ఆటో కార్మికుల జీవితం ఆగం చేస్తున్నారని జిల్లా ఆటో కమిటీ సొసైటీ సభ్యులు, నంగునూరు మండలం కార్మిక విభాగం అధ్యక్షులు గోనేపల్లి సిద్దేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. నంగునూరులో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు తెలుసుకోకుండా సీఎం కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాదులోని ఆటో కార్మికుడు సతీష్‌గౌడ్ జీవనోపాధి దొరకక మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరివేసుకొని చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఎలక్షన్ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులను పట్టించుకోకపోతే ప్రతి నియోజకవర్గం నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయం జరిగేంత వరకు రోడ్లపైకి వచ్చి నిరసనలు, నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నంగునూరు గ్రామ ఆటో అధ్యక్షులు బీనబోయిన మల్లేశం, ఉపాధ్యక్షులు కిష్టయ్యమాజీ అధ్యక్షులు కోల రాజు గౌడ్, హనుమంతు, అనరాజు రాజు, లక్ష్మారెడ్డి, పిడిచెట్టి యాదగిరి,ఆంజనేయులు, నర్సింలు, మల్లేశం, శ్రీనివాస్ గౌడ్, సత్యం, నర్సింలు, సాయి, గౌరయ్య ఆటో కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు 13 మంది ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 అండ్ 16 బాలబాలికల విభాగంలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో 13 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కర్రోల్ల వెంకట స్వామి గౌడ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ బి.స్వాతి (జడ్.పి.హెచ్.ఎస్ రాఘవపూర్), ఎస్ మౌనిక జడ్పీహెచ్ఎస్ చిన్నకోడూర్, రామ్ చరణ్ (ఆర్ డి ఎఫ్ మటిండ్ల) , బి నిఖిల్ యాదవ్ జగదేవ్పూర్, ఎం నవ్య (జడ్.పి.హెచ్.ఎస్ దుంపలపల్లి), శ్రీ చందన మెరీడియన్ హై స్కూల్, భాగ్య టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బెజ్జంకి, బి రమేష్ (జడ్.పి.హెచ్.ఎస్ భూంపల్లి), సిహెచ్ స్పందన శ్రీవాణి హై స్కూల్(సిద్దిపేట), శివకుమార్ (జడ్పీహెచ్ఎస్ రాఘవపూర్), ఎస్ రాహుల్ ఎస్ డి ఎ ఏ, వి అజయ్ జడ్పీహెచ్ఎస్ చిన్నకోడూర్, లోహిత్ రెడ్డి (ఆద్య స్కూల్ సిద్దిపేట)లు ఎంపికైనారని తెలిపారు. వీరు గుజరాత్ రాష్ట్రంలో అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ అంతర్ జిల్లా పోటీలో పాల్గొంటారని, అదేవిధంగా ఈనెల 28న కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు 25 మందిని ఎంపికై చేసినట్లు తెలిపారు.